రిపోర్టర్లు కావలెను
ప్రకాశం జిల్లాలో
'జాతీయ వార్త' తెలుగు దినపత్రికలో
పనిచేసేందుకు ఆసక్తి ఉన్న
రిపోర్టర్లు సంప్రదించగలరు
9908862557

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com





మంగళవారం | 14-4-2026 | ప్రకాశం | సంపుటి: 3 సంచిక: 645 పేజీలు: 2 వెల: రూ.7

# చేవూరులో ఉద్యానశాఖాధికారుల..

# మాయాజాలం



**కందుకూరు, ఏప్రిల్ 13 (జాతీయ వార్త):** రామాయపట్నం పోర్టు అనుసంధానంగా బీపీసీఎల్‌కు గుడ్లూరు మండలం చేవూరు రావూరు గ్రామాల్లో భూ సేకరణ జరుగుతుంది. ఇదే అదునుగా కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. చేవూరు గ్రామంలో ఓ రైతు చెందిన భూమిలో సంవత్సరం మొక్కలు ఉంటే వాటిని ఆరు సంవత్సరాలు చెట్లుగా చిత్రీకరించి వచ్చే పరిహారాన్ని సగం సగం పంచుకునేలా ఒప్పందాలు చేసుకున్నారు. అయితే ప్రభుత్వ పరిహారం రైతుకు చేరిన తర్వాత పంపకాల్లో తేడాలు రావడంతో విషయం బట్టబయలైంది

## నిబంధనలివి..

మామిడి, టేకు, కొబ్బరి, జామ, సపోటా, వివిధ రకాల చెట్లకు ఏపీ మారిటోరియం బోర్డు పరిహారం చెల్లింపు కోసం వాటి వయస్సు, పొలంలో ఉన్న మొక్కల సంఖ్య ఆధారంగా నిబంధనలు రూపొందించారు. ఏడాది వయస్సు దాటని మొక్కలైతే రూ.వెయ్యి చొప్పున, ఆరున్నరేళ్లు దాటిన పెద్ద చెట్లు అయితే గరిష్టంగా చెట్టుకు రూ.8,500 వరకు పరిహారం చెల్లించాలని ఆ మార్గదర్శకాలలో పేర్కొన్నారు. ఎకరంలో గరిష్ఠంగా 40 చెట్ల వరకు ఉండే అవకాశం ఉన్నందున అంతకు మించకుండా వాస్తవంగా ఎన్ని ఉంటే అన్నింటికి వాటి వయస్సు ఆధారంగా పరిహారం చెల్లించాలని నిర్దేశించారు. మొక్కల వయస్సు ఆధారంగా పరిహారాన్ని చెల్లించాల్సివుంది.

## కేసులు దాకా వెళ్ళిన ఉద్యానవన శాఖ అధికారి..

రైతు, క్షేత్రస్థాయి ఉద్యోగి తనను వేధిస్తున్నారంటూ ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి గుడ్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయటంతో అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. చేవూరుకు చెందిన మా కన్నబోయిన శేషయ్య, క్షేత్రస్థాయి సహాయకుడు రఘుపై ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో వారిద్దరినీ విచారణకు పిలిపించిన పోలీసులు వారు చెప్పిన సమాచారంతో విస్తుపోయినట్లు తెలిసింది. అయితే చేవూరులో ఖాళీగా ఉన్న తన ఎనిమిది ఎకరాల మెట్ట భూమికి మామిడి చెట్ల పరిహారం ఇప్పిస్తామని అందుకోసం పదిలక్షలు లంచం మాట్లాడుకున్నారని అందులోభాగంగా వారు సూచించిన గుడ్లూరులోని ఓ గోల్డ్ షాప్ నిర్వాహకుడికి రూ.లక్ష, నెల్లూరు జిల్లా కలిగిరి ఎస్బీఐలో ఖాతా కలిగి ఉన్న ఓ వ్యక్తికి రూ.4లక్షలు తన అకౌంటు నుంచి ట్రాన్స్ఫర్ చేశానని శేషయ్య పోలీసులకు వివరించాడు. అయితే మిగిలిన రూ.5లక్షలు కూడా ఇవ్వమని రఘు అడగ్గా తనకు పరిహారం జమ అయ్యాక కదా మిగిలిన సగం ఇచ్చేదని చెప్పానని, అంతకుమించి నేనేమీ వేధించలేదని తెలిపారు. అయితే ముందు ఇచ్చిన రూ.5 లక్షలు హెచ్చైకు వెళ్లగా వాటిలో తనవాటా ఇవ్వమని అడగ్గా రైతు వద్ద వసూలు చేసుకోమని ఆమె చెప్పటం వివాదానికి దారితీసింది. దీంతో ఆ నగదును క్షేత్ర సహాయకుడు ఖాతాకు కలిగిరి ఎస్బీఐ ఖాతాదారుడు నుంచి ట్రాన్స్ఫర్ చేయించి ఆ తర్వాత ఖాతాను సీజ్ చేయించి ఉద్యానవన శాఖ అధికారి ఫిర్యాదు చేసినట్లు రఘు ఆరోపిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో తన ప్రమేయం లేదని అధికారి చెబుతున్నారు.

- పరిహారం చెల్లింపులో అవకతవకలు
- చిన్న మొక్కలను పెద్ద చెట్లుగా చిత్రీకరణ
- చేతులు మారిన కోట్ల రూపాయలు
- రామాయపట్నం పోర్టు అనుసంధానంగా బిపిసిఎల్‌కు భూములు సేకరణ
- వందలాది ఎకరాల్లో మామిడి తోటలు
- పరిహారం చెల్లింపులో చక్రం తిప్పిన క్షేత్రస్థాయి ఉద్యోగి
- వాటాల పంపకాల్లో తేడాలు
- పోలీస్ కేసులతో బట్టబయలు
- చర్చనీయాంశమైన మామిడి మొక్కల వ్యవహారం
- ఖాళీ భూములకు కూడా చెల్లింపులపై అనుమానం



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



ప్రకాశం

# గ్రీవెన్స్ అర్జీలు.. త్వరగా పరిష్కారం కావాలి

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు
- గుడ్లూరు ఎంపీడీవో కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహణ
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ
- అధికారులు గైర్హాజరు పట్ల ఆగ్రహం



**గుడ్లూరు, ఏప్రిల్ 13 (జాతీయ వార్త):** గ్రీవెన్స్‌లో అర్జీలు త్వరగా పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గుడ్లూరులోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 31 శాఖల అధికారులకు గాను.. 8 మంది మాత్రమే హాజరు కావడంపై ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనుంచి తప్పనిసరిగా ప్రతి శాఖ నుండి గ్రీవెన్స్‌కు హాజరు కావాలన్నారు. శాఖల వారీగా, గత 3 నెలలుగా పెండింగ్ లో ఉన్న అర్జీలను ఎమ్మెల్యే పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యాలయానికి వచ్చిన అర్జీదారులను ప్రత్యేకంగా పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే కారణంగా రెవెన్యూ సమస్యలు ఎక్కువగా వచ్చాయన్నారు. ప్రభుత్వం వాటి పరిష్కారంపై దృష్టి పెట్టిందన్నారు. అధికారులు బాధ్యతగా పనిచేస్తూ, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. గ్రీవెన్స్ లో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నానని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.









## టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
# నారీ శక్తి వందన్

**కందుకూరు, ఏప్రిల్ 13 (జాతీయ వార్త):** కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నారీ శక్తి ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవికుమార్ మాట్లాడుతూ చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న రోజున చరిత్రలో నిలిచిపోయే రోజుగా మారుతుందన్నారు. ఈ బిల్లు ఆమోదించబడినట్లైతే చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని ఇది శుభ పరిణామం అని పేర్కొన్నారు. ముఖ్య అతిథి డాక్టర్ పి.కుసుమకుమారి మాట్లాడుతూ ఆర్థిక స్వావలంబన కలిగిన మహిళలు కూడా ఇంకా సమాజంలో చాలామంది ఉన్నారని, నిర్ణయాధికారం లేకుండా ఉండడం అనేది విచారకరమైన విషయమని తెలియజేశారు. మహిళలు స్వయం నిర్ణయాధికారం కలిగిన శక్తి స్వరూపులుగా ఎదగాలన్నారు. కళాశాల లోని చరిత్ర అధ్యాపకులు డాక్టర్ డి. రామాంజనేయులు మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదింపబడడం చాలా అవసరమైన విషయమన్నారు. 33 శాతం కాకుండా 50 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు జరిగినట్లయితే ఇంకా బాగుంటుందని తెలిపారు. మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ కొమ్మనబోయిన సుజాత మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ప్రాతిపదికగా చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె వి పద్మావతి, డాక్టర్ అనూష, రాఘవరావు, సి హెచ్ అలేఖ్య, ఎం శారద, టీ హరీష్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై దాడి



**లింగసముద్రం, ఏప్రిల్ 13 (జాతీయ వార్త):** మండలంలోని ముత్యాలపాడు గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఎస్ఐ రాంబాబు తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.13,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాంబాబు మాట్లాడుతూ, లింగసముద్రం మండలంలో పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని ఆయన కోరారు.

## పీజీఆర్ఎస్ అర్జీలపై సమీక్ష



**ఉలవపాడు, ఏప్రిల్ 13 (జాతీయ వార్త):** ఉలవపాడు మండల తహశీల్దార్ కార్యాలయములో తహశీల్దారు ఏ వి రవి శంకర్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పీజీఆర్ఎస్ అర్జీలు 22(ఏ) ఫైల్స్ అదర్స్ జీరో ఖాతాలు మ్యుటేషన్ ఫైల్స్ గురించి చర్చించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు పరిశీలించి తక్షణం పరిష్కారం చూపాలని తహశీల్దార్ సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# ఉలవపాడు డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ జయంతి

**ఉలవపాడు, ఏప్రిల్ 13 (జాతీయ వార్త):** మండల కేంద్రమైన ఉలవపాడు జీవీఎస్ ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు సోమవారం ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డి. సుజాత సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదని, సమాజ సమానత్వం కోసం పోరాడిన గొప్ప దార్శనికుడని కొనియాడారు. ఇంగ్లీష్ అధ్యాపకులు ఎూా కుమార్ మాట్లాడుతూ అద్భుతమైన కృషితో రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా వ్యవహరించి, మహిళా సాధికారత కోసం హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెట్టారని తెలిపారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు జి. కిషోర్ మాట్లాడుతూ సమాజ మార్పుకు విద్య మాత్రమే మార్గమని అంబేద్కర్ బలంగా నమ్మారని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ "జ్ఞాన సూర్యుడి" జయంతి వేడుకలు

ప్రపంచ జ్ఞాన సూర్యుడు, భారత రాజ్యాంగ రూపశిల్పి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆధునిక భారత పితామహుడు, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు సోమవారం భీమవరం జడ్.పి.హెచ్.ఎస్ లో ప్రధానోపాధ్యాయులు బండి సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు మేడికొండ భాస్కర్ మాట్లాడుతూ అసమానతలతో కూడిన భారత సామాజిక వ్యవస్థలో ఇబ్బందులు పడుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజలు, మహిళలకు సాంఘిక సమానత్వం ఆర్థిక సమానత్వం స్వేచ్ఛ సౌభ్రతత్వాలను సాధించి పెట్టడానికి విద్య అనే ఆయుధంతో తన జీవితం చివరి రోజుల వరకు సమత మమతల సమాజం కోసం పోరాడాడన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన స్ఫూర్తితో విద్యార్థులు అత్యున్నతమైన విద్యా శిఖరాలను చేరుకొని భారత దేశ అభివృద్ధికి పాటుపడాలని విద్యార్థులకు ఉద్బోధించారు. బాబా సాహెబ్ తాను జీవితకాలం సంపాదించిన జ్ఞానాన్ని రంగరించి భారత రాజ్యాంగంగా రూపొందించారని ఆస్ఫూర్తితోనే భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ అభివృద్ధి దశలో దూసుకుపోతుందన్నారు. విద్యార్థులు భారత రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. ప్రపంచంలో ఎవరూ చదవలేనని చదువులు చదివి 32 డిగ్రీలతో ప్రపంచ జ్ఞానఖనిగా నిలిచిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జన్మదినం ను అత్యున్నతమైన ఐక్యరాజ్యసమితి "నాలెడ్జ్ డే"గా ప్రపంచమంతా జరుపుకోవాలని పిలుపునివ్వడం భారతీయులుగా మనకు గర్వకారణం అని తెలిపారు. విద్యార్థులు డాక్టర్ బాబాసాహెబ్‌ను స్ఫూర్తిగా తీసుకుని తమ జీవితాలలో విద్యా విలువలు, విద్యా వెలుగులు నింపుకొని భారత దేశంలో సమత మమతలతో కూడిన సామాజిక వ్యవస్థను నెలకొల్పడానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దార్ల అంకయ్య, మస్తాన్ వలి, చిట్టిబాబు, హేమలత, సుబ్బారావు, సిబ్బంది హనుమంతరావు బుజ్జయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546